క్లుప్తంగా

క్షీరబంధు నగదు అందజేత



అనుముల్లంక(గంపలగూడెం): తిరువూరు పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోని గంపలగూడెం మండలం అనుముల్లంక పాల ఉత్పత్తిదార్ల సహకార సంఘ సభ్యులు ఇరువురు ఇటీవల మరణించగా వారి బంధువులకు క్షీరబంధు పథకంలో మంజూరైన నగదును బుధవారం అందజేశారు. పాడి రైతులు మందపాటి మాధవరెడ్డి, ధనికొండ అనంతరెడ్డిలు మృతి చెందారు. వీరు ఇరువురు కృష్ణా మిల్క్ యూనియన్ అందజేసే క్షీరబంధు పథకంలో సభ్యులుగా ఉండటంతో ఒక్కొక్కరికి రూ.50 వేలు మంజూరయ్యాయి. ఆమొత్తాన్ని వారి కుటుంబీకులకు పాలశీతలీకరణకేంద్రం మేనేజర్ టీ సాంబమూర్తి, సహకార సంఘం అధ్యక్షుడు భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి(బీఎస్) అందజేశారు. సొసైటీ పాలకవర్గ సభ్యులు నర్సారెడ్డి, పుల్లారెడ్డి, రంగారెడ్డి, సూపర్‌వైజర్‌లు ప్రసాద్, నరశింహారావు, వేతన కార్యదర్శి శ్రీనివాసరావు, పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట



గంపలగూడెం: గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం పలు దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవయజనం శ్రీధరాచార్యులు, రామాచార్యుల ఆధ్వర్యంలో విఖసన మహర్షి, లక్ష్మీహయగ్రీవ, నాగబంధనలు (జంటనాగులు), పంచముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రతిష్ఠా కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఆలయ కమిటీ వైస్ చైర్మన్ కే కోదండరామ్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

95 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు



కనిమెర్ల తండా(మైలవరం): ప్రతి ఒక్కరూ రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవాలని ప్రభుత్వ వైద్యశాల పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రమ్య తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల దత్తత గ్రామం కనిమెర్ల తండాలో స్పెషల్ క్యాంపులో భాగంగా ఐదవ రోజు బుధవారం పాఠశాల విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రమ్య మాట్లాడుతూ విద్యార్థులు భోజనం చేసే సమయంలో, ఇతర పదార్థాలు తినే సమయంలో చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు. 95 మంది విద్యార్థులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రమైన వాతావరణంలో ఉండాలని, ఆరోగ్యంపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.శివ హరిప్రసాద్ ప్రసంగించారు. ఇన్‌చార్జి ఉమామహేశ్వరరెడ్డి, కళాశాల వలంటీర్లు పాల్గొన్నారు.

25న శ్రీఅష్టలక్ష్మీ ఆలయ వార్షికోత్సవం



తిరువూరు: స్థానిక రాజుపేటలోని శ్రీఅష్టలక్ష్మీ దేవాలయ 15వ వార్షికోత్సవం ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కాసులనాటి పద్మనాభశాస్త్రి తెలిపారు. 24న ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయని, ఉదయం 7 గంటలకు విశేష పూజలు, పుణ్యాహవచనం, అంకురార్పణ, 25న ఉదయం 10.45 గంటలకు శ్రీలక్ష్మీనారాయణస్వామి కల్యాణం, 26న శాంతిహోమాలు, లలితా సహస్ర నామ పారాయణ, సామూహిక కుంకుమపూజలు, పూర్ణాహుతి, దీపలక్ష్మీపూజ జరుగుతాయని తెలిపారు. 25న స్వామివారి కల్యాణం సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహిస్తామని తెలియజేశారు.

సామూహిక సాయి వ్రతాలు

తిరువూరు: స్థానిక శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో బుధవారం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి సందర్భంగా సామూహిక వ్రతాలు ఆచరించారు. సాయిబాబాకు అష్టోత్తర శతనామాలతో విశేష పూజలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం పలువురు దంపతులు సామూహిక వ్రతాలలో పాల్గొన్నారు. మందిర కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టిగా కృషి చేయండి

మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు



వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు

మైలవరం: వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేసి మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నను అధికారంలోకి తీసుకురావాలని మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు తెలిపారు. మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని మండలాల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో బుధవారం సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు మాట్లాడుతూ త్వరలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామాల్లో పర్యటిస్తానని, స్థానికంగా ఉన్న సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. సామాన్యుడినైన తనను, ముఖ్యమంత్రి జగనన్న పార్టీకి విధేయుడిగా ఉన్న తనను గుర్తించి అసెంబ్లీకి పంపడానికి తనకు ఎమ్మెల్యే సీటు కేటాయించారని, ఆయన నమ్మకాని వమ్ము చేయకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ శ్రేణులు విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్, ఎమ్మెల్యేగా తన గెలుపునకు కృషి చేయాలన్నారు. మైలవరం నియోజకవర్గ పరిశీలకులు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2024 ఎన్నికలు ఒక సామాన్యుడికి, ఆగర్భ శ్రీమంతుడుకి జరుగుతున్న యుద్ధమని, ఈ యుద్ధంలో సామాన్యుడు అయిన సర్నాల తిరుపతిరావుని గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటూ నియోజకవర్గం అభివృద్ధికి కృసి చేస్తాడన్నారు. ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యానారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జే గంగాధరరావు ప్రసంగించారు. సమావేశంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి..

మైలవరం: మైలవరం నియోజకవర్గంలోని కొండపల్లికి చెందిన 10 కుటుంబాల వారు టీడీపీని వీడి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. కొండపల్లి గ్రామానికి చెందిన రాయుడు వెంకట్రావు, కే రాము, భవానీ, గోలి లక్ష్మి, బి.దుర్గ, పీ సీతమ్మ, ఏ జ్యోతి, ఎస్.లక్ష్మి తదితర పది కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు తదితరులు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొత్తగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పరిపాలనా తీరు, బీసీల పట్ల ఆయన చూపిస్తున్న అభిమానం, సంక్షేమ పథకాలు అమలు తీరుకు ఆకర్షితులమై పార్టీలో చేరామన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడానికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ముఖ్యనేతలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలి



మాట్లాడుతున్న సర్నాల తిరుపతిరావు



మాట్లాడుతున్న డాక్టర్ హనిమిరెడ్డి, పక్కన సర్నాల తిరుపతిరావు

మైలవరం: వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని ప్రవాసాంధ్రులు, విద్యాదాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి తెలిపారు. మైలవరంలోని ఆయన నివాసంలో మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావుతో కలిసి బుధవారం మీడియాతో మాట్లాడారు. సామాన్య కుటుంబానికి చెందిన వ్యక్తి తిరుపతిరావును అసెంబ్లీలో కూర్చోబెట్టేందుకు ముఖ్య మంత్రి జగన్ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని, అదేవిధంగా మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావును, విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని)ని గెలిపించాలని డాక్టర్ హనిమిరెడ్డి కోరారు. అమెరికా వెళ్తున్న సందర్భంగా మాట్లాడారు.

ఎన్నికల కోడ్ అమలుకు సహకరించాలి

జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్



మైలవరం: ఎన్నికల కోడ్‌ను సమర్థవంతంగా అమలుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మైలవరం నియోజకవర్గ రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సంద్భంగా జేసీ సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటి నుంచే రాజకీయ పార్టీలు చేస్తున్న ఖర్చులను నోట్ చేసుకోవడం జరుగుతుందన్నారు. పార్టీల నాయకులు ప్రతి ఖర్చును తప్పనిసరిగా ఎన్నికల అధికారులకు తెలియజేయాలన్నారు. పొలిటికల్ మీటింగ్‌లు, ప్రచారాల అనుమతికి తహసీల్దారు కార్యాలయంలో నలుగురుతో కూడిన కమిటీని ఏర్పాటు చేశామన్నారు. అనుమతుల కోసం ముందుగా ఏ పార్టీ వారు వస్తే వారికి అనుమతినివ్వడం జరుగుతుందని, తరువాత వచ్చిన వారికి గంట తేడాతో అనుమతి ఇస్తామన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఎన్నికల డీటీ ప్రసాద్, తహసీల్దార్ రాజేశ్వరరావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వాహణకు పటిష్ట చర్యలు

ఆర్డీవో భవానీశంకర్

ఇబ్రహీంపట్నం: పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు విజయవాడ ఆర్డీవో భవానీశంకర్ అన్నారు. ఇబ్రహీంపట్నం నిమ్రా కళాశాలలో ఎన్నికల రిసెప్షన్ సెంటర్ ఏర్పాట్లు వివిధ శాఖల అధికారులతో కలసి బుధవారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా చేపట్టాల్సిన చర్యలపై క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి తగుసూచనలు ఇచ్చారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు, తర్వాత తీసుకోవల్సిన చర్యలు సమన్వయంతో అధికారులకు చేపట్టాలన్నారు. నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్లు మహేష్, సత్యవతి, ఏసీపీలు భాస్కరరావు, రత్నరాజు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా వాహన తనిఖీ చేపట్టాలి



వసతులను పరిశీలిస్తున్న సీపీ టీకే రాణా, డీసీపీ ఆదిరాజ్ సింగ్ రాణా

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీగా వాహనాలు తనిఖీ చేపట్టాలని సీపీ టీకే రాణా సీఐఎస్ఎఫ్ బలగాలకు సూచించారు. గుంటుపల్లిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు, ఇబ్రహీంపట్నం ఏకాలనీ ఆడిటోరియంలో సీఐఎస్ఎస్ బలగాలకు ఏర్పాటు చేసిన సదుపాయాలను డీసీపీ ఆదిరాజ్‌సింగ్ రాణాతో కలసి బుధవారం ఆయన పరిశీలించారు. ప్రత్యేక బలగాలకు ఏర్పాటు చేసిన వసతి సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. చెక్‌పోస్టు వద్ద కొద్దిసేపు వివిధ వాహన తనఖీలను పర్యవేక్షించారు. వాహన తనిఖీల్లో సిబ్బందికి సూచనలు ఇచ్చారు. వీరి వెంట సీఐ ఎం.సత్యన్నారాయణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

జనరిక్ మందుల షాపు ప్రారంభం



ఆగిరిపల్లిలో జనరిక్ మందుల షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రతాప్

ఆగిరిపల్లి: జనరిక్ మందుల షాపులతో పేదలకు అధిక ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే మేకవెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లిలో ఏర్పాటు చేసిన జనరిక్ మందుల షాపును బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జనరిక్ మందులు అతి తక్కువ ధరకే లభించడం వలన సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఖర్చు తగ్గుతుందన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త గడప గడపకు వెళ్లి వివరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, జిల్లా ఉపాధ్యక్షురాలు సుజనా కుమారి, ఎంపీటీసీ సాదం గోపి, గోళ్ల ఇస్సాకు, పార్టీ గ్రామ అధ్యక్షుడు చిమాట శ్రీను, నాయకులు నక్కనబోయిన పండు, వాకా సకేశ్వరరావు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం ఆకస్మిక తనిఖీ



మూలపాడు(ఇబ్రహీంపట్నం): టెన్త్‌క్లాస్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న స్థానిక జెడ్పీ పాఠశాలను ఎంపీడీవో ఉమాదేవి, ఎంఈవో సీహెచ్ పుష్పలత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుపై ఆరా తీశారు. పరీక్ష హాల్లో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు గైర్హాజరు కావద్దన్నారు. పరీక్ష హాలులోకి వెల్తున్న విద్యార్థులు ఎటువంటి ఎల్రక్టానిక్ పరికరాలు తీసుకువెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. పరీక్షల నిర్వాహణపై ఇన్విజిలేటర్లకు పలు సూచనలు చేశారు.

ఓటర్లకు పోలీసు భరోసా



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

ఊటుకూరు(గంపలగూడెం): సాధారణ ఎన్నికల సమర్థ నిర్వహణలో భాగంగా మండలంలోని ఊటుకూరులో పోలీసులు బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. తిరువూరు సీఐ షేక్ నబీ పర్యవేక్షణలో ఎస్ఐ ఎస్ శ్రీను ఆధ్వర్యంలో పోలీసులు, కేంద్ర బలగాలు గ్రామంలోని ప్రధాన వీధుల వెంట ఫ్లాగ్ మార్చ్ జరిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల సజావుగా నిర్వహణకే ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఓటర్లకు పోలీసులు భరోసా కల్పించారు.

ముసునూరు: ప్రజలందరూ ఎన్నికలపై అవగాహన కలిగి ఉండాలని నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ తెలిపారు. బుధవారం సాయంత్రం ఎస్ఐ పి.వాసు ఆధ్వర్యంలో మండలంలోని రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి గ్రామాల ప్రధాన కూడలి కేంద్రాల్లో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. గ్రామాల్లో ఎన్నికల సంబంధిత ఘర్షణలు తలెత్తకుండా నివారించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నాగఫణి భూషణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా



రమణక్కపేటలో పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎస్ఐ తదితరులు

ముసునూరు: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అతి సమస్యాత్మక, సమస్యాత్మక గ్రామాలను, పోలింగ్ స్టేషన్లను ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. బుధవారం మండలంలోని అతి సమస్యాత్మక గ్రామాలైన కాట్రేనిపాడు, రమణక్కపేటల్లో పోలింగ్, గ్రామ కూడలి కేంద్రాలను ఎంపీడీఓ పద్మావతీ దేవి, ఎస్ఐ పి.వాసు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద గదులను, విద్యుత్ సౌకర్యం, తదితర వసతులను తనిఖీ చేశారు. అతి సమస్యాత్మక, సమస్యాత్మక గ్రామాలను సైతం గుర్తించడంతోపాటు, పూర్తి నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల నేపథ్యంలో ఎన్నికల వివాదాల నివారణ, గ్రామాల్లో గ్రూపు తగాదాల నివారణ తదితర అంశాలపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఆర్ఐ దీపిక, ఈఓపీఆర్డీ శ్రీనివాస్, కార్యదర్శి ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

నెమలి(గంపలగూడెం): ఈనెల 23వ తేదీ నుంచి మండలంలోని నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఆరురోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఏ డీసీపీ కనకరాజు (ఎస్‌బీ), విజయవాడ రూరల్ ఏడీసీపీ బి.పార్థసారథి గ్రామంలో పర్యటించి ఏర్పాట్లపై ఆలయ అధికారులు, పాలకవర్గ సభ్యులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈనెల 25వ తేదీన జరుగనున్న స్వామి కల్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరు కానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆలయ సహాయ కమిషనర్ ఎస్.వెంకట సాంబశివరావుకు తెలిపారు.

బ్రహ్మోత్సవాల సందర్భంగా తాగునీటి సరఫరా, విద్యుద్దీకరణ, పారిశుద్ధ్య చర్యలు తదితర అంశాలపై చర్చించారు. కాగా కనకరాజు, పార్థసారధిలు ఈసందర్భంగా వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు ఆశీర్వదించారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, తిరువూరు సీఐ నబీ, ఎస్ఐ ఎస్ శ్రీను, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా వార్షిక కల్యాణ మహోత్సవం



పూజలో పాల్గొన్న భక్తులు

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఏడవ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. సమరసతసేవా ఫౌండేషన్, టీటీడీ సంయుక్తంగా నిర్మించిన ఈ ఆలయంలో ఏటా వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు కొత్తూరు తాడేపల్లి సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు, మాజీ ఉప సర్పంచ్ దొంతగాని వెంకటేశ్వరావు, గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ధూళిపాళ్ల రమేష్, ముఖ్య అతిథులుగా హాజరై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. వేడుకల్లో భాగంగానే ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు పూజలు నిర్వహించారు. ఈ పూజలలో ఈవీఈ సంస్థ చైర్మన్ ఈడా వేదాద్రితో పాటు వంకదారు సత్యదుర్గ వెంకటేశ్వరరావు గోళ్ల సాయికుమార్ దంపతులు పాల్గొన్నారు.

ఈడా వేదాద్రి రూ.50 వేల విలువైన మంగళసూత్రాలను ప్రత్యేకంగా తయారు చేయించి బహూకరించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.

పౌష్టికాహారం, వ్యాయామంతో రక్తహీనత దూరం



మైలవరం: ప్రతి రోజు వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పిల్లలు, గర్భిణుల్లో రక్తహీనత అరికట్ట వచ్చని ఎన్టీఆర్ జిల్లా డీఎమ్‌హెచ్ఓ టాస్క్‌ఫోర్స్ బృందం ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.లక్ష్మి తెలిపారు. మైలవరం-2 పరిధిలోని ఎంపీపీ పాఠశాలలో ఏర్పాలు చేసిన వైద్య శిబిరంలో బుధవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు, స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవడం వలన గర్భిణులు ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తారని ఇన్‌చార్జి లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో డీఎమ్‌హెచ్ఓ కార్యాలయం ఎన్టీఆర్ జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు డీపీహెచ్ఎన్ఓ లినట్ లిడియా, ఎస్.లక్ష్మీజీ, సీహెచ్ఓ రాహేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

దంతాల ఆరోగ్యంపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

నూజివీడు: నోరు, దంతాల ఆరోగ్యం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏరియా ఆసుపత్రి దంత వైద్యులు దినేష్ అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఏరియా ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరేటెడ్ డ్రింక్స్, షుగర్ పదార్థాలు, చక్కెర పానీయాలు, చాక్లెట్, గుట్కాలు తదితర పదార్థాలు పళ్లకు హాని చేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు రెండు సార్లు బ్రష్ చేసుకోవాలన్నారు. ఆహార పదార్థాలు తిన్న తరువాత నీళ్లతో నోటిని పుక్కిలించాలన్నారు. దంతాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. సీనియర్ వైద్యులు ఆర్ నరేంద్రసింగ్, శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

84 మద్యం సీసాలు స్వాధీనం

మైలవరం: అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద తనిఖీల సందర్భంగా 84 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. స్థానిక ఎస్ఐ ఎస్.హరిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మండలంలోని మొర్సుమల్లి గ్రామంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈతనిఖీల్లో ఏపీ 24 ఎక్స్ 8166 నంబర్ కలిగిన హెచ్‌పీ గ్యాస్ సిలిండర్స్ లోడ్ కలిగిన లారీలో లారీ డ్రైవర్ తెలంగాణ మద్యం సీసాలను తీసుకువస్తుండగా స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అరెస్టు చేశామన్నారు. మద్యం సీసాల విలువ సుమారు రూ.61,560 ఉంటుందన్నారు. ఈ కేసులో దర్యాప్తుచేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

44 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఇబ్రహీంపట్నం: అక్రమంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న ఆకుమర్తి ప్రసాద్ అనే వ్యక్తిని కేతనకొండ గ్రామంలో బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద వివిధ రకాల 44 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిళ్ల విలువ సుమారు రూ.7,260 ఉంటుందని సీఐ ఎం.సత్యన్నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. నిందితుడు ప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సత్యన్నారాయణ తెలిపారు.

పోషకాహారంపై అవగాహన

చాట్రాయి: పోషక విలువల గల ఆహారంపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ నూజివీడు ప్రాజెక్టు సీడీపీవో నూరాని తెలిపారు. బుధవారం మండలంలోని తుమ్మగూడెం గ్రామంలో గర్భిణులు, బాలింతలకు పోషక విలువల గల ఆహారంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆకు కూరల్లో ఐరన్, ఖనిజ లవణాలు, పాలల్లో కాల్షియం, పప్పుల్లో మాంసకృతులు, గుడ్డులో అన్ని రకాల పోషక విలువలు ఉంటాయని ఆమె చెప్పారు. గర్భిణులు, బాలింతలు తప్పకుండా ఈ ఆహార పదార్థాలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఏసీడీపీవో నాగేశ్వరి, సూపర్‌వైజర్ గాయత్రి పాల్గొన్నారు.

ముగిసిన తపస్సు కాల ధ్యానకూటాలు

తిరువూరు: స్థానిక సహాయమాత చర్చిలో మూడు రోజులుగా నిర్వహించిన తపస్సు కాల ధ్యానకూటాలు బుధవారం ముగిశాయి. చర్చి ఫాదర్ రెవరెండ్ జంగం విజయకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నీతివంతుడైన పునీత యేసేపు దైవకుమారుడికి సంరక్షకుడిగా చేసిన సేవలను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. తపస్సు కాలంలో ఆచరించాల్సిన నియమాలను వివరించారు. స్వస్థత ప్రార్థనలు, దివ్యబలిపూజ, దివ్య సత్ప్రసాద స్వీకరణ తదితర కార్యక్రమాలు జరిగాయి. తిరువూరు విచారణ పరిధిలోని విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భారత్ బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నూజివీడు: భారత్ బార్ అసోసియేషన్ నూజివీడు నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామిశెట్టి వెంకట సత్యన్నారాయణ, కార్యదర్శిగా బసవరాజు రామకృష్ణ, ఉపాధ్యక్షురాలిగా దార్ల కుమారి, సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ అర్జునరావు, కోశాధికారిగా బీ దేవదానం, మహిళా ప్రతినిధిగా జే జీవిత, లైబ్రేరియన్‌గా వైఎస్ దొరై, పీఆర్‌వోగా గోళ్ల ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మడుపల్లి బసవారావు, నల్లపాటి సుబ్బారావు, ప్రత్తిపాటి రవి, కిషోర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

26న హుండీ కానుకల లెక్కింపు

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామంలో మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు లెక్కిస్తామని ఆలయ చైర్మన్ కోటగిరి సునీల్‌బాబు, ఈఓ వై.సీతారామయ్య బుధవారం తెలిపారు. దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో హుండీ కానుకలను లెక్కింపు నిర్వహిస్తామన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

తోటమూల(గంపలగూడెం): తోటమూల గాయత్రి స్కూల్‌లో పదవ తరగతి పబ్లిక్ పరీక్ష సెంటర్ విద్యార్థులకు గంపలగూడెంకు చెందిన కొల్లా నాగేశ్వరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు కొల్లా కృష్ణకుమారి, కే దీప్తి, పసుమర్తి సావిత్రి పాల్గొన్నారు.

- తిరువూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు తిరువూరు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో సమితి కన్వీనర్ దామెరప్రభాకరరావు ఆధ్వర్యంలో మజ్జిగ అందజేశారు. పరీక్షలుముగిసేవరకు చలివేంద్రం కొనసాగిస్తామన్నారు.